లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

టమోటాల కోసం మురుగునీటి సమీపంలో క్యూలో వేచి ఉన్న ప్రజలు

టమోటా.. సమస్య తీరేదెట్లా?

- రైతు బజార్లో బారులు తీరిన ప్రజలు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న కడప రైతు బజార్లో సబ్సిడీ టమోటాల కోసం ప్రజలు బారులు తీరారు. రోజుకు రెండు టన్నుల టమోటాలు 2000 మందికి విక్రయించాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్లో టమోటా ధర కిలో రూ.100 నుంచి రూ.150 వరకు పలుకుతూ ఉంది. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ టమోటాలు రూ.50 విక్రయిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల లోపు టమా టాలు ఖాళీ అవుతున్నాయి. పోలీస్ బందోబస్తు లేకపోవడంతో తోపులాటలు చోటు చేసుకుంటోంది. అధికారులు స్పందించి పోలీస్ బందోబస్తు మధ్య టమోటాలు పంపిణీ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. సబ్సిడీ టమోటాల కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి క్యూ లైన్లో నిలబడాల్సి వస్తుంది. అధికార, రాజకీయ పలుకుబడి కలిగిన వారికి లైన్లో లేకపోయినా టమోటాలను పంపిణీ చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. వందల సంఖ్యలో ప్రజలు కిలో మీటర్ మేర క్యూ కడుతున్నారు. రైతు బజార్ ఎదుట మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరును తొలగించాలని పలువురు కోరుకుంటున్నారు.

డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా కార్యకర్తలు డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లతో సంబంధం లేని పనులు చేయించరాదని, నాణ్యమైన సెల్ఫోన్లు, 4జి సిమ్స్ ఇవ్వాలని, ఆన్లైన్ వర్క్ శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజమణి మాట్లాడుతూ జాబ్ వర్కర్స్తో సంబంధంలేని పనులు చేయించరాదని, ఆన్లైన్ వర్కులు పేరుతో ఆశ గుత్తను వేధింపులు, బెదిరింపులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని కోరారు. పనిచేయని సెల్ ఫోన్లతో ఆశా వర్కర్లు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆశావర్కర్స్కు రోజు విలేజ్ క్లినిక్, సచివాలయాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉండాలని, క్లినికల్ క్లీన్ చేయటం, ఓపీ వర్క్, అటెండర్ పనులు చేయించడంతో పాటు ఉదయం, సాయంత్రం రెండు సార్లు రిజిస్టర్లో సంతకాలు చేయాలని అధికారులు వేధించడం సరికాదని చెప్పారు. రికార్డ్స్ సొంత డబ్బులు పెట్టి కొనాలని, సంబంధం లేని ఆన్లైన్ పనులన్నీ సొంత ఫోన్ ద్వారా చేయాలని వేధిస్తున్నారని తెలిపారు. సెలవులు లేకపోవడంతో అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దళితుల భూములు లాక్కోవడం దారుణం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

దళితులకు ప్రభుత్వం కేటాయించిన భూములపై అగ్రవర్ణ పెత్తందారులు కన్నేసి, లాక్కోవాలని చేసే ప్రయత్నం చాలా దారుణమైనదని ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్లలో విలేకరుల సమావేశంలో ఏపి దళిత వేదిక జిల్లా కన్వీనర్ ఓబిగాళ్ల ఓబయ్య మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలో మడకలవారిపల్లెలో జగనన్న స్మార్ట్ సిటీ పేరుతో దళితుల భూములను లాక్కుంటున్నారని, అగ్రవర్ణ పెత్తందారులు దళితులకు కేటాయించిన భూములపై కన్నేసి, లాక్కోవడం హేయనీయమని దళితులపై దౌర్జన్యం జరుగుతుందని చూస్తూ ప్రభుత్వం ఏం చేస్తుంది అని ప్రశ్నించారు. దళితులంటే చిన్నచూపు తగదని హితవు పలికారు. బద్వేల్ ప్రాంతంలో చెరువు శిఖం భూములను కూడా అగ్రవర్ణాలు ఆక్రమిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క దళిత కుటుంబానికి 5 ఎకరాల వ్యవసాయ భూమి, ఐదు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితుల సంక్షేమం విస్మరించి, వారి భూమిని కబ్జా చేసేవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళిత సమాఖ్య రాష్ట్ర సంక్షేమ కార్యదర్శి ఒద్దేపోగు యోహాను, మద్దూరు యేసయ్య, కొండయ్య పాల్గొన్నారు.

ఊమెన్ చాందీ మరణం పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి - కడప

కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఊమెన్చాందీకి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలలో నిలకడ విశ్వసనీయత సంతృప్త మనస్తత్వం వంటి సద్గుణాలకు ప్రతీక అన్నారు. ఇప్పటివరకు 12 సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు రాష్ట్ర మంత్రిగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు వంశీ యాదవ్, అడ్వకేట్ భవన ఏకాదశి రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు చిన్న, ప్రభు కుమార్, చక్రి, జయరాజ్, మౌలా, హర్ష, అశోక్, సంతోష్, వినయ్, అనిల్, సునీల్ పాల్గొన్నారు.

ఊమెన్ చాందీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థుల హక్కులను కాలరాసే ఉత్తర్వులను

వెనక్కి తీసుకోవాలి

డిఇఒ కార్యాలయం వద్ద ధర్నాలో విద్యార్థి, యువజన సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా, విద్యార్థులు నిరసన కార్యక్రమాలలో పాల్గొనకూడదని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తిరుమలేసు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భారత్, ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ల బాబు, పిఎస్యు జిల్లా కార్యదర్శి నాగేంద్ర, డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు షాకీర్, ఎఐవైఎఫ్ నాయకులు మైనుద్దీన్ మాట్లాడారు. విద్యార్థులు తమ సమస్యలపై పోరాడేందుకు వీలు లేకుండా ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా ర్యాలీలు, ధర్నాలో పాల్గొనకూడదని డిఇఒ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్య హక్కులకోసం, ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన తెలిపే ప్రతి పౌరునికీ ఉందన్నారు. విద్యార్థుల హక్కుల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాటాలు చేసేందుకు వీలు లేదని చెప్పడం డిఇఒ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలిపారు. డిఇఒ ప్రభుత్వ అధికారిగా కాకుండా అధికార పార్టీ నాయకులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు దగ్గర ఉండటం వల్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటాలు చేయకూడదని వైసిపి ప్రభుత్వానికి అనుకూలంగా డిఇఒ ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారిగా కొనసాగుతున్న ఈ డిఇఒ ప్రభుత్వం పట్ల తన భక్తిని చాటుకున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కడప జిల్లాలో సర్క్యులర్ జారీ చేయడం వెనుక మతలబు ఏంటని, ఎవరి మెప్పు కోసం డిఇఒ తాపత్రయమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా సమస్యలపై పోరాటాల్లో విద్యార్థులు భాగస్వామ్యం కావద్దని అలా కాకుండా ర్యాలీ, ధర్నాలల్లో విద్యార్థులు పాల్గొంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఉత్తర్వులుజారీ చేయడం సిగ్గు చేటని వారు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని విద్యాసంస్థలు నడుస్తున్నా, ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేసి దోపిడి చేస్తున్నా చర్యలు తీసుకోలేని డిఇఒ విద్యార్థులను మాత్రం ర్యాలీలు, ధర్నాలలో పాల్గొనకూడదని ఆదేశాలు ఇవ్వడం విడ్డురంగా ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారి తను జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.ఆర్.నాయక్, ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్, పవన్ కల్యాణ్, డివైఎఫ్ఐ నాయకులు రెబ్బ నరసింహులు, పిఎస్యు నాయకులు గోపి పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి, యువజన సంఘం నాయకులు

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి

ప్రజాశక్తి - కడప

ప్రాధాన్యతా రంగాలను అన్నివిధాలా పటిష్టం చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాలులో జెసి గణేష్ కుమార్తో కలిసి కలెక్టర్ అధ్యక్షతన అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, పనుల పురోగతి, సాధించిన ప్రగతిపై సమీక్షించారు. వ్యవసాయ శాఖ పరిధిలో జిల్లాలో ఖరీఫ్ సాగుబడిని పెంచడంతో పాటు అధిక దిగుబడులను సాధించేలా యాజమాన్య పద్ధతులను రైతులు పాటించేలా అవగాహన పెంచాలన్నారు. ప్రతి రైతూ సాగుచేసే పంటలకు ఈ-క్రాప్ బుకింగ్తో పాటు ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేయించాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని ఆర్బికెల ద్వారా వ్యవసాయ, ఉద్యాన రంగ సేవలను విస్తృతం చేయాలన్నారు. ఎపిఎంఐపి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సన్న చిన్నకారు రైతులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సూక్ష్మ సేద్యం ద్వారా సాగుబడి విస్తీర్ణాన్ని పెంపొం దించాలన్నారు. జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న రైతు బజార్లు, మార్కెటింగ్ గిడ్డంగుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ బ్యాంకు అధికారులకు సూచించారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఎపిఎంఐపి పీడీ రవీంద్రారెడ్డి, డిసిఓ సుభాషిణి, హార్టికల్చర్, సిరి కల్చర్, పశుసంవర్ధక శాఖ, ఫిషరీస్, మార్కెటింగ్, పరిశ్రమలు వివిధ ప్రాధాన్యత రంగాలకు చెందిన జిల్లా అధికారులు, బ్యాంకింగ్ అధికారులు పాల్గొన్నారు.

'ప్రత్యేక లోక్ అదాలత్'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న జడ్జి

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న జిల్లా వ్యాప్తంగా ఉదయం 10. 30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రత్యేక లోక్ అదాలత్ను నిర్వహిస్తున్నామని, ప్రజలు, కక్షిదారులు వినియోగించుకొని సత్వర న్యాయం పొందాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.కవిత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎం ప్రదీప్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవనంలో ప్రత్యేక లోక్ అదాత్కు సంబంధించి ఎంఇఒపి పిటీషనర్ న్యాయవాదులకు ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక లోక్ అదాలత్లో మోటార్ వాహనాల ప్రమాదాలకు, భూ సేకరణకు సంబంధించిన కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 08562 - 258622, 244622 లేదా districts.ecourts.gov.in/Kadapa, dlsakdp@gmail.com ద్వారా గాని సంప్రదించవచ్చునని తెలిపారు. కక్షిదారులు ఈ ప్రత్యేక లోక్ అదాలత్లో కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చునని అన్నారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ జి.వి. రాఘవరెడ్డి, ఎంఇఒపి పిటిషనర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం కోసమే సచివాలయం

చింతకొమ్మదిన్నె : ప్రజా సమస్యల సత్వర పరిష్కారాల కోసమే సచివాలయాల ఏర్పాటు ముఖ్య ఉద్దేశమని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు, మంగళవారం స్థానిక కొలుములపల్లెలో నూతనంగా నిర్మించిన పంచాయతీ సచివాలయన్ని రాష్ట్ర పరిశ్రమల ప్రభుత్వ సలహా దారుడు రాజోలి వీరారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు జగనన్న సురక్ష కార్య క్రమం ఏర్పాటు చేసి గ్రామాల్లో ఉన్న ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తారని చెప్పారు. అవకాశాన్ని ప్రజలు ఉపయో గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుబ్బరాయుడు, మండల పరిషత్ , అధ్యక్షులు కళా యాదవ్ ఉపాధ్యక్షుడు సుధాకర్రెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి, గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్ శ్రీ రాములురెడ్డి, అధికారులు ఎంపిడిఒ రవికుమార్ రెడ్డి, తహశీల్దార్ నారాయణరెడ్డి, స్థానిక పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

పోలీసు శాఖకు వెలకట్టలేని సేవలందించి మరణించిన వారికి జిల్లా పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పి కెకెఎన్ అన్బురాజన్ భరోసా ఇచ్చారు. డిఆర్డిఎలో ఎఆర్ కానిస్టేబుల్గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మరణించిన బి. రామకృష్ణ సతీమణి బి. నాగలక్ష్మికి కార్పస్ నిధి నుంచి మంజూరైన రూ. లక్ష ఆర్థిక సాయాన్ని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. వారి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్.పి(అడ్మిన్) తుషార్ డూడి పాల్గొన్నారు.

ఘనంగా ముక్తియార్ విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

బహుమతి ప్రదానం చేస్తున్న ముక్తియార్

ముక్తియార్ విద్యా సంస్థల (మెడిఫస్ట్) ఫ్రెషర్స్ డేని ఘనంగా రాజ రాణి మహల్ (మూల వంక)లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యా సంస్థల చైర్మన్ వి.ఎస్ ముక్తియార్ హాజరై మాట్లాడుతూ నూతన విద్యా ర్థులకు ఆశీసులు పలుకుతూ, వృత్తి విద్యా కోర్సుల అయిన ఫిజియోథెరపీ, లాబ్ టెక్నీషియన్, నర్సింగ్ కోర్సులలో చేరడం ద్వారా మంచి నిర్ణయం తీసుకున్నారని వారిని అభినదించారు. విద్యార్థులందరూ అధ్యాపకులు చెప్పిన విధంగా చదువుకొని మంచి మార్కులు తెచ్చుకొని తల్లిదండ్రులకు సమాజానికి సేవ చేయాలని ఆయన పేర్కొన్నారు. కరెస్పాండంట్ అలీ అక్బర్ మాట్లాడుతూ చదువుతోపాటు, క్రమశిక్షణ, ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. అనంతరం యూనివర్సిటీ ర్యాంకులు సాధిం చిన విద్యార్థులను అభినందించారు. అకాడమిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం వచ్చిన విద్యార్థులకు, వివిధ స్పోర్ట్స్ కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భారత్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, ఫారుక్ అహ్మద్, ముక్తియర్ కళాశాల డైరెక్టర్ హుస్సేన్బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం : ఫ్యాప్టో

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయులు ధర్నాలలో, ర్యాలీలలో పాల్గొనకూడదని, అలా పాల్గొన్నట్లయితే సిసిఎ రూల్స్ ప్రకారం ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని డిఇఒ వై.రాఘవరెడ్డి ఉత్తర్వులు జారీ చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేయడమేనని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్ విమర్శించారు. ప్రజాస్వామిక హక్కులను కాలరాసే విధంగా డిఇఒ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యుటిఎఫ్ భవన్లో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు ప్రతి పౌరునికీ రాజ్యాంగం ద్వారా కల్పించిందని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన 'సమ్మె'లను న్యాయస్థానాలు సైతం సమర్ధించిన విషయాన్ని డిఇఒ గుర్తెరగాలన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు జారీ చేస్తూ, సస్పెన్షన్లు చేస్తూ వేధిస్తున్నారన్నారు. ప్రభుత్వంతోపాటు పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి మొదలుకొని డిఇఒ వరకు ఇలాంటి విధానాలకే పాల్పడుతున్నారన్నారు. విద్యా శాఖధికారులు తమ వైఖరిని మార్చుకోకపోతే ఉద్యమాలను మరింత తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. సమావేశ అనంతరం కలెక్టరేట్ ఏవో, ఆర్జేడి, డిఇఒ లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వెంకటసుబ్బయ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఎపిటిఎఫ్(257) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.భాస్కర్ రెడ్డి, సి.నాగ రాజు, ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షులు వి.వి.వీరాంజుల రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్.అబ్దుల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి, బిటిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.హరి కొండయ్య పాల్గొన్నారు.

బాస్కెట్బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కడప అర్బన్

చిన్నచౌక్లోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నగరంలోని జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల బాస్కెట్బాల్కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎం. వివేకానంద రెడ్డి మంగళవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు ఈనెల 21 నుంచి 24 వరకు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలోని రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్లో 14 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో పిఇటి లక్ష్మయ్య, నాగార్జున, జయ చంద్ర, ఎంపికైన క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ వివేకానందరెడ్డి

చిరు వ్యాపారులకు బాసట

'జగనన్న తోడు'

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న తోడు' . చిరు వ్యాపారుల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తుందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి 7వ విడత లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి కలెక్టర్తోపాటు జెసి గణేష్ కుమార్, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం కలెక్టర్ జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 20,589 మంది చిరు వ్యాపారులకు మంజూరైన రూ.22,27,20,000లతో పాటు, 23,705 మంది మహిళలకు మంజూరైన రూ. 58,75,775 ల వడ్డీ రాయితీ మొత్తం మెగా చెక్కును గౌరవ అతిథులతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జగనన్న తోడు కార్యక్రమం ద్వారా పేద చిరు వ్యాపారస్తులకు ఎలాంటి వడ్డీ లేకుండా రూ.10 వేలు అందిస్తోందని చెప్పారు. ఈ రుణం సంవత్సర కాలంలో వడ్డీ లేకుండా కేవలం రూ.10 వేలు మాత్రమే తిరిగి చెల్లించేలా ప్రభుత్వం సౌలభ్యం కల్పించిందన్నారు. అర్హత ఉండి ఇంకనూ ఎవరైనా పొందలేక పోయి ఉంట సంబంధిత గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకో వాలన్నారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో తన సుదీర్ఘ పాదయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది చిరువ్యాపారులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచే దిశగా ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మెప్మా, డిఆర్డిఎ పిడిలు సురేష్ కుమార్, ఆనంద్ నాయక్, సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు, స్వయం సహాయక సంఘ మహిళా సభ్యులు, జగనన్నతోడు లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు నిర్మాణం ఆపాలని నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆర్డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెల్పుతున్న అఖిలపక్ష నాయకులు

జిల్లా రిజిస్టర్ కార్యాలయ ఆవరణలో పెట్రోల్ బంక్ నిర్మాణం తక్షణం ఆపాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డిఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, కడప నియోజకవర్గ ఇన్చార్జి అమీర్ బాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. టిడిపి ప్రభుత్వం పాత మున్సిపల్ ఆఫీసు ఆవరణలో అన్నా క్యాంటీన్ రూ.25 లక్షలతో ఏర్పాటు చేస్తే, వైసిపి ప్రభుత్వం దానిని కూలదోసి పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసిందని మండిపడ్డారు. ఇప్పుడు జిల్లా రిజిస్టర్ కార్యాలయ ఆవరణ పెట్రోల్ బంకుకు లీజుకు ఇవ్వడం ఏమాత్రం సరి కాదన్నారు. పేరులోనే ధర్మ ఆయన చేసేది అంతా అధర్మమే అన్నారు. 40 ఏళ్ల చరిత్రలో ఇటువంటి అధికారిని తాను చూడలేదని ఆర్డిఒ ధర్మచంద్రారెడ్డి తీరును విమర్శించారు. బ్రిటిష్ పాలనలో కలెక్టరేట్, తహశీల్దార్, రిజిస్టర్ కార్యాలయాలకు సొంత స్థలాన్ని ధారాదత్తం చేశారన్నారు. ప్రజల అవసరానికి వినియోగించక, లీజుకు ఇచ్చే అధికారం ఎవరిచ్చారని అధికారులను నిలదీశారు. టిడిపి అధికారంలోకి రాగానే ఇటువంటి లీజులన్నీ రద్దు చేయిస్తామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ 1836లో పిచ్చయ్య అనే వ్యక్తి ఇచ్చిన స్థలాలపై హక్కులను రద్దు చేసే అధికారం ఆర్డిఒకు లేదని చెప్పారు. 2002 వరదలకు జిల్లా రిజిస్టర్ కార్యాలయం పాక్షికంగా దెబ్బతినడంతో భవనాన్ని నిర్మిం చేంతవరకు పాత రిమ్స్ లోకి మార్చారని పేర్కొన్నారు. అక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల దూరాన ఉన్న బుద్ధా టౌన్షిప్కు మార్చడం వల్ల కక్షిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెట్రోల్ బంకు నిర్మాణాన్ని తక్షణం ఆపి రిజిస్టర్ కార్యాలయాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెట్రోల్ బంకు నిర్మాణం ఆపాలని ఆర్డిఒకు అఖిలపక్ష పార్టీల నాయకులు వినతి పత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్, అఖిలపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గ్రామసేవకుల సంఘం గౌరవాధ్యక్షులు మనోహర్

రేపటి నుంచి గ్రామ సేవకుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 20, 21వ తేదీలలో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు చేపడుతున్నట్లు గ్రామ సేవకుల సంఘం గౌరవాధ్యక్షులు మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రిలే దీక్షలు నిర్వహించాలని తెలిపారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా 2017, మార్చి 24 న గ్రామ సేవకుల ధర్నాకు వచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.15 వేల జీతం పెంచుతానని హామీ ఇచ్చారని చెప్పారు. ఆ హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లు దాటినా పెంచకపోవడం బాధాకరమని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానమైన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అర్హులైన విఆర్ఎలందరికీ అటెండర్, వాచ్మెన్, డ్రైవరు, విఆర్ఒ పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాతల ముత్తాతల కాలం నుంచి పని చేస్తున్న వారిని నామినీలుగా గుర్తించాలి, డిఎ రికవరీని ఆపి తీసుకున్న డబ్బులు వెంటనే తిరిగి ఇవ్వాలని కోరారు. గ్రామ సేవకుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 7, 8న కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు, 25న చలో విజయవాడ కార్యక్ర మాన్ని నిర్వహిస్తామని, విఆర్ఎలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, విఆర్ఎ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి వెంకటపతి పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

కలసపాడు : మండలంలోని కొత్తకోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లింపులు చెల్లించాలని సిఇఒ కె. నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక సహకార సొసైటీలో నలుగురు పర్మినెంట్ ఉద్యోగులు రైతులకు సేవలు అందిస్తున్నారని, ఎప్పటికప్పుడూ ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనలను, సలహాలను చేరవేస్తున్నారని చెప్పారు. ఖరీఫ్, రబీ సీజన్లతో రుణమాఫీ అందిస్తూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. తమకు ప్రభుత్వం నెలనెలా వేతనాలు అందించాలని సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ఉన్నతాధికారులు తమ బాధలను దృష్టిలో ఉంచుకొని సకాలంలో జీతాలు మంజూరు చేయాలని కోరారు.

యాంటీ ర్యాగింగ్పై పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలలో భాగంగా చైతన్యం చేసే పోస్టర్లను మంగళవారం వైవీయూ క్యాంపస్లోని ఎంబిఎ డిపార్ట్మెంట్లో వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు విడుదల చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సరిత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ర్యాగింగ్కు దూరంగా ఉండాలన్నారు. విశ్వవిద్యాలయంలోని క్యాంపస్, హాస్టల్ విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలన్నారు. తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే జైలుకు పోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని, ప్రజలు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిటిసి సభ్యులు కనపర్తి సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రావుల పల్లె గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. దుంపలగట్టు గ్రామ సర్పంచు రెడ్యం నాగవేణి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రెడ్యం రామకృష్ణారెడ్డి, అధికారులు, వాలంటీర్లు, సచివాలయ ఇన్‌ఛార్జి కార్యదర్శి శ్రీనివాసులు, ప్రజలు పాల్గొన్నారు.

పత్రాలను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రేపు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

- పలువురు మంత్రుల రాక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈ నెల 20న మంత్రులతో పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి తెలిపారు. రాచమల్లు వారి రాజన్నభోజనం ప్రాంగణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంచినీటి కష్టాలు తీర్చేందుకు రూ.150 కోట్లతో చేపట్టిన అమృత్ పథకాన్ని, మున్సిపల్ గాంధీ పార్కును, అర్బన్‌హెల్త్ సెంటర్‌ను, మైదుకూరు రోడ్డు స్మార్ట్‌సిటీకి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. హోంశాఖ మంత్రి తానేటి వనిత, పురపాలక పట్టణాభివృద్ధి శాఖామాత్యులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు వస్తున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవాలనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. రాజన్నభోజనంపై ఎవరూ ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని ఈ సేవాకార్యక్రమం నిరంతరం కొన సాగిస్తామన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సోమవారం టిడిపి నాయకుల పర్యటనలో రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామాభివృద్ధిపై అవగాహన లేకుండా మాట్లాడారని తెలిపారు. ఈ నాలుగేళ్లల్లో రూ.4కోట్ల 39లక్షల 62వేలతో అభివృద్ధి చేశామని రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరులో భూ కబ్జాలు అధికం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ తాళ్ళమాపురం గ్రామంలో కబ్జా చేసిన స్థలంలో భూమి పూజ చేసేందుకు వచ్చిన చర్చి నిర్వాహకులు. ఈ కబ్జాలో అన్యాయమైన భూయాజమానుల తరపున ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కంటే కొన్నేళ్ల క్రితం దాదాపు 500 ప్లాట్లు కొనుగోలు చేసిన పేదల భూములు ఎవరో విక్ర యిస్తే ఎలా కొనుగోలు చేస్తారంటూ ప్లాట్ల యజమానుల తరపున ప్రశ్నించారు.

బాధితులతో ధర్నా చేస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అరెస్టు..

కొత్తపల్లె పంచాయతీ పరిధిలో తాళ్ళమాపురం భూ కబ్జా బాధితుల తరపున వారితో కలిసి ధర్నా చేస్తున్న ప్రవీణ్‌కుమార్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రూరల్ పోలీస్‌స్టేషన్ చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. కేసు నమోదు చేసి, నోటీసులు ఇచ్చి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని విడుదల చేశారు. అనంతరం తన ఇంటివద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ భూ కబ్జా విషయంలో ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డికి సంబంధం ఉందా లేదా అని ప్రశ్నించారు. కబ్జా వారే బౌన్సర్లను పెట్టుకుని పడుకోవడం చూస్తుంటే ఈ ప్రభుత్వంలో దౌర్జన్యం ఎటు వెళ్తుందో అర్థం కాని పరిస్థితి అన్నారు. రెవిన్యూ అధికారులు అడ్డగోలుగా పట్టాలివ్వడంతో బాధితులు పరిస్థితి మనసుకు బాధ కలిగించేలా ఉందన్నారు. కోర్టు ఆర్డర్స్ ఉన్నా పోలీసులు బాధితులు పక్కన నిలువ లేదన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జబీఉల్లా పాల్గొన్నారు.

పాల ఉత్పత్తులు పెంచేలా చూడాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో పాల ఉత్పత్తుల పెంచేలా చర్యలు చేపట్టాలని మెప్మా అధికారి గంగులయ్య అన్నారు. మంగళవారం మెప్మా కార్యాలయంలో ఆయన ఉలిమెల్ల పెద్ద రంగాపురం బ్రాహ్మణపల్లె ఆర్పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు రుణాలు ఇప్పించి పాల ఉత్పత్తులు పెంచేలా చర్యలు చేపట్టా లన్నారు. వైయస్సార్ పాలవెల్లి ద్వారా పాడి రైతులకు ప్రభుత్వం రుణాలు కూడా మంజూరు చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసు కోవాలని కోరారు. మెప్మా సిఇఒలు నాయుడు, నాగన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెప్మా అధికారి గంగులయ్య

రాష్ట్ర బిసి వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రాష్ట్ర వెనుకబడిన తరగతుల వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నియమించింది. ప్రొద్దు టూరు పట్టణానికి చెందిన రమేష్ యాదవ్‌కు కౌన్సిలర్ నుంచి ఎమ్మెల్సీ పదవి దక్కింది. అయితే నేడు ఆయనకు బీసీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ పదవి దక్కడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కడప జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు దక్కిన ప్రత్యేక గౌరవమన్నారు. పదవికి న్యాయం చేసి, జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించడానికి కష్టపడి పని చేస్తామన్నారు.

సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న రమేష్ యాదవ్

క్రైం కార్నర్

సెంట్రింగ్ కొడుతూ అదుపుతప్పి కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సెంట్రింగ్ కొడుతూ అదుపుతప్పి కింద పడి కర్నూలు జిల్లా ఆలూరు తాలూకా దేవకొండ మండలం కుంకునూరు గ్రామానికి చెందిన బోయ పులికొండ(25) మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. అదే గ్రామానికి చెందిన ఆజం మరి కొంతమందిని కూలీలతో కలిసి పులివెందులలోని పాత గంగారెడ్డి హాస్పిటల్‌లో ఒక బిల్డింగ్ పని చేసేందుకు వచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం సెంట్రింగ్ పని చేసేందుకు పులికొండ పైకి ఎక్కి బిగిస్తుండగా ప్రమాదవశాత్తూ కింద పడిపోయాడు. వెంటనే అతన్ని తోటి కార్మికులు పులివెందుల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మెడికల్ షాపుల్లో ధరల మాయాజాలం..!

ఎంఆర్‌పి చూపుతూ అమ్ముతున్న వైనం-జనరిక్ మందులూ బ్రాండ్ తరహాలో విక్రయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తక్కువ ధరలో లభిస్తున్న జనరిక్ మందులను మెడికల్ షాపుల వారు వాటికి మూడు రెట్లు అదనంగా బిల్లు వేస్తూ ప్రజలను అందినకాడికి దోచుకుంటున్నారు. సాధారణంగా మందులపై ఉండే గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పి) చూపిస్తూ రూ. 30 ఉండే మందును రూ.125కు అమ్ముతున్నారు. అతి చౌకగా లభించే జనరిక్ మందులను కూడా బ్రాండెడ్ కంపెనీల మందుల తరహాలో ఎంఆర్‌పి అమ్మకాలు సాగిస్తున్నారు. ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరకు అమ్మకూడదనే నిబంధనను యజమానులు తమకు అనుకూలంగా మార్చుకుని విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కోవిడ్ అనంతరం అనారోగ్యాల కారణంగా అధికంగా మందులు వాడాల్సి వస్తోంది. ప్రతి ఇంట్లో ఒక్కరైనా నిత్యం మందులు వాడాల్సిన పరిస్థితి. కాస్త అవగాహన ఉన్నవారు తక్కువ ధరలో లభ్యమయ్యే జనరిక్ మందుల కొనుగోలు పట్ల ఆసక్తి చూపుతున్నారు. మందుల పట్ల అవగాహన లేనివారు మెడికల్ షాపులలో కొనుగోలు చేస్తున్నారు. కొన్ని మెడికల్ షాపులు తక్కువ ధరకు జనరిక్ మందులు తెచ్చి వాటినే బ్రాండెడ్ మందుల తరహాలో ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఉదాహరణకు సిప్లా కంపెనీకి చెందిన పాంటోసి డిఎస్‌ఆర్ క్యాప్సూల్స్ గ్యాస్ సమస్య ఉన్న వారు రోజువారీగా పరగడుపున వాడతారు. ఇవి జనరిక్‌లోనూ లభిస్తున్నాయి. 10 క్యాప్సూల్స్ జనరిక్ మెడికల్ షాపులో రూ.46కే అమ్ముతున్నారు. కానీ సదరు స్ట్రిప్‌పై ఎంఆర్‌పి రూ.125 ఉంటుంది. దీన్ని ఒక్కో మెడికల్ షాపులో ఒక్కో రేటుపై రూ.100 లేదా రూ.88కు అమ్ముతున్నారు. కొనుగోలుదారు దానిపై ఉన్న ఎంఆర్‌పి చూసి తక్కువకే ఇచ్చినట్లు భావిస్తున్నారు. అసలు ధర కన్నా మూడు రెట్లు సొమ్ము మెడికల్ షాపుల వారికిచ్చి మందులు కొంటున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో అనేక బ్రాంచిలు ఉన్న అతి పెద్ద యాజమాన్యం వారు కూడా జనరిక్ మందులను మూడు రెట్లు అదనంగా ధర నిర్ణయించి అమ్మకాలు జరుపుతున్నారు. జనరిక్ మందులు వచ్చి 20 ఏళ్లు అవుతున్నా అత్యధికులకు ఈ మందుల గురించి తగిన అవగాహన లేదు. పట్టణాల్లో కొన్ని ప్రాంతాల్లో జనరిక్ మెడికల్ షాపులు ఉన్నా ప్రజలకు వీటి గురించి తెలియదు. పట్టణాల్లో ఉన్న పెద్ద షాపుల వారు కూడా జనరిక్ మందులను ఎక్కువ ధరలకు అమ్మకాలు సాగిస్తూ ప్రజలను దోచుకుంటున్నారు.

జనరిక్ మందు అంటే.. ఒక కొత్త మందును కనుగొనడానికి ఫార్మా కంపెనీలు అనేక పరిశోధనలు, పరీక్షలు చేసి మందును మార్కెట్లోకి తెస్తాయి. అందుకు ప్రతిఫలంగా ఆ మందు తయారీపై ఆ కంపెనీకి కొంత కాలం పాటు (20సంవత్సరాల వరకు) పేటెంట్ హక్కులు ఉంటాయి. అలా తయారు చేసిన మందులను బ్రాండెడ్ డ్రగ్స్ లేదా స్టాండర్డ్ డ్రగ్స్ అంటారు. ఆ మందు తయారీ ఫార్ములా తెలిసినా ఏ ఫార్మా కంపెనీ అయినా సరే, దానిని పేటెంట్ ఉన్న కాలంలో పేటెంట్ పొందిన కంపెనీ అనుమతి లేకుండా ఆ మందు తయారు చేయకూడదు. అలా పేటెంట్ లో ఉన్న మందులను ఇతరులు ఎవరైనా తయారు చేసి అమ్మరాదు. అందువల్ల 20 సంవత్సరాల పాటు ఆ మందుపై దానిని తయారు చేసిన కంపెనీకి పేటెంట్ హక్కులు కల్పించి పెట్టుబడి సొమ్మును రాబట్టుకోడానికి ఆ మందును మొట్టమొదట తయారు చేసిన కంపెనీకి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. ఏదైనా ఒక మందు మొట్టమొదటి తయారు చేసిన కంపెనీ పేటెంట్ కాలం ముగిసిన తర్వాత అదే ఫార్ములాతో అదే మందును ఏ కంపెనీ అయినా తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చేయొచ్చు. అలా తయారు చేసిన మందులను జనరిక్ మందులు అంటారు. జనరిక్ మందు తయారు చేయడానికి ఫార్మా కంపెనీలు ఎలాంటి పరిశోధనలు గానీ, క్లినికల్ ట్రయల్స్ గానీ జరపవలసిన అవసరం ఉండదు. అందువల్ల జనరిక్ మందుల ధరలు బ్రాండెడ్ మందుల ధరలతో పోలిస్తే 30 నుంచి 80 శాతం తక్కువలో లభిస్తాయి. వీటిపై ముద్రించి ఉండే ఎంఆర్‌పి కంటే చాలా తక్కువ ధరకే లభిస్తాయి. కాని వాటి ధర వాస్తవానికి చాలా తక్కువగా ఉన్నప్పటికీ వాటి మీద మీద ముద్రించబడిన ధర చాలా ఎక్కువగా ఉంటుంది. దీన్ని మెడికల్ షాపుల వారు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. కొనుగోలుదారు అడిగితే కొంచెం ధర తగ్గిస్తున్నారు. అధికారులు స్పందించి మెడికల్ షాపుల్లో దోపిడీని అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

రూ.1.40 కోట్లతో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ వనిపెంట రోడ్డులోని అంకాలమ్మ దేవాలయం నుండి నానుబాలపల్లె మీదుగా చిన్నయ్యగారిపల్లె గ్రామం వరకు బిటి రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గుంతలమయంగా ఉన్న రహదారులను గుర్తించి బాగు చేస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాలకు రహదారులను అభివృద్ధి చేశామన్నారు. చిన్నయ్యగారిపల్లె వరకు 4కిమీ రూ.1.40 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. అనంతరం నంద్యాల రోడ్డు ఆనకుంటలో నూతనంగా నిర్మిస్తున్న బాలికల పాఠశాల భవనాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైసిపి నాయకులు జేష్ఠది రవి, అధికారులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మడూరు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి సిబ్బందిని గ్రామాల్లోనే ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రస్తుతం గడపగడపకూమన ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రతి గడపకు నేరుగా ఎమ్మెల్యేలు వెళుతున్నారన్నారు. మడూరు గ్రామంలో 642 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నామన్నారు. ఇంటింటికి వెళ్లి 92శాతం సర్వే పూర్తి చేయడం పట్ల ఎమ్మెల్యే సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, తహశీల్దార్ సుభాని, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గహసారధుల మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచు పి.వెంకటలక్ష్మమ్మ, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి బాగ్యలక్ష్మీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదులో వాలంటీర్ల ప్రమేయం ఉండదు

మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి నరసింహులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీలతో ఎన్నికల ఎలక్ట్రోరల్ అధికారి నరసింహులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల పరిధిలో జనవరి 1 నుండి ఏప్రిల్ ఒకటి వరకు, జూలై 1 నుండి అక్టోబర్ 1 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నాయకుల సందేహాలను నివృత్తి చేశారు. ఎన్నికల నిర్వహణలో, ఓట్ల నమోదు, తొలగింపులో బిఎల్‌ఓ, బిఎల్‌ఎలు మాత్రమే పాలుపంచుకుంటారని వివరించారు. ఓటర్ల నమోదు, తీసివేతలలో వాలంటీర్ల ప్రమేయం ఉండదని ఎలక్షన్ కమిషన్ స్పష్టం చేసినట్లు నాయకులకు తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఎన్నికల నిర్వహణ, నమోదులో వాలంటీర్లు జోక్యం చేసుకుంటే తమకు ఫిర్యాదు చేయాలని, చర్యలు తీసుకుంటామని తెలిపారు. దువ్వూరు పోలింగ్‌స్టేషన్ 27 సంజీవరెడ్డిపల్లెలో ఉండే విధంగా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తమ బూత్‌ల పరిధిలో పోలింగ్‌స్టేషన్ల మార్పు, ఓటర్ల సమస్యలపై ఎన్నికల అధికారికి రాజకీయ పార్టీల నాయకులు వివరించారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లు, టిడిపి, వైసిపి, బిజెపి, ఆమ్‌ఆద్మీ, రాజకీయ పార్టీల నాయకులు హాజరు కాగా జనసేన, సిపిఎం, సిపిఐ నాయకులు గైర్హాజరయ్యారు.

రైతుల మేలు కోరేది టిడిపినే : 'పుట్టా'

ప్రజాశక్తి - దువ్వూరు

మండల కేంద్రమైన స్థానిక మూడు రోడ్ల కూడలిలో భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్ర బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎంత దారుణంగా ఉందో ప్రజలకు అర్థమవుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వం వస్తే ప్రజలకు ఎన్నో విధాలా ఉపయోగపడుతుందన్నారు. ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి మాట్లాడుతూ తుగ్లక్ పరిపాల రాష్ట్రంలో సాగుతోందన్నారు. మాజీ శాసనసభ్యులు అమీర్‌బాబు, బీటెక్ రవి, ముక్తియార్, మండల కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి, జిల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

నిమ్మకాయల దర్బార్‌కు టిడిపి నేతల పరామర్శ

వేంపల్లె : టిడిపి నేత నిమ్మకాయల దర్బార్‌ను మంగళవారం టిడిపి నేతలు పరామర్శించారు. హై బిపితో అస్వస్థతకు గురైన ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి రావడంతో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహబూబ్ బాషా, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు కొమెర నాగరాజు, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి పరామర్శించి, ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ఏలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు రామాంజనేయురెడ్డి (చంటి), నిమ్మకాయల షాకీర్, అహమ్మద్, షేక్ రఫీ, ఖాసీం, పఠాన్, షామీర్ పాల్గొన్నారు.

చీనీ మార్కెట్‌ను అభివృద్ధి చేయండి

- పాడా ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలో చీనీ పండ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని పాడా ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో చీని వ్యాపారులు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చీని రైతులు అధికంగా ఉన్నారని, మార్కెట్ ఏర్పాటు చేస్తే వారికి ఎంతో మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యఉద్దేశ్యమన్నారు. ఆ దిశగా అడుగులు వేయడానికి చీని మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని వ్యాపారులను కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆర్‌జెడి రామాంజనేయులు, డిడి శ్రీకాంత్‌రెడ్డి, ఎడి అజీద్‌వల్లి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డి, అనంతపురం చీని వ్యాపారులు పాల్గొన్నారు.

హామీల అమలులో టిడిపి, వైసిపి దొందూదొందే

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

విభజన చట్టంలోని హామీల అమలులో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు దొందూదొందేనని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సీమాంధ్రకు ప్రత్యేకహోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేకప్యాకేజీ, కడప స్టీల్ ప్లాంట్, దుగ్గపట్నం ఓడరేవు, పోలవరం ప్రాజెక్టుకు జాతీయహోదా, విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖ రైల్వేజోన్ అమ లై ఉంటే ఈపాటికి సీమాంధ్ర స్వర్ణాంధ్ర అయి ఉండేదన్నారు.

ఊమెన్ చాంటీ మృతి బాధాకరం ..

కాంగ్రెస్ కురువృద్ధుడు, సిడబ్ల్యుసి మెంబర్, ఎపి ఇన్‌ఛార్జిగా ఉన్న ఊమెన్ చాంటీ మృతి చెందడం బాధాకరమని తులసిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఉమెన్ చాంటీ చిత్రపటానికి నివాళులర్పిం చారు. కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, నరసిం హారెడ్డి, బద్రి, రాఘవయ్య, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు,

ప్రతి ఇంటికీ నీటి కుళాయిలు

- సర్పంచు రాచినేని శ్రీనివాసులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాజారెడ్డి నగర్‌లో ప్రతి ఇంటికీ నీటి కుళాయిలు మంజూరు చేస్తామని సర్పంచు రాచినేని శ్రీనివాసులు తెలి పారు. మంగళవారం నూతనంగా వేసిన తాగునీటి పైపు లైనును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు వైఎస్ రాజారెడ్డి నగర్‌కు పైపులైను వేశామన్నారు. అడిగిన ప్రతి ఒక్క ఇంటికీ నీటి కుళాయిలు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి బ్రహ్మయ్య, వార్డు సభ్యులు ఘాకురు, శ్రీనువాసులు, నగేష్, బ్రహ్మ, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాపాయిపల్లెలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - పెద్దముడియం

మండలంలోని పాపాయిపల్లె గ్రామంలో మంగళవారం జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్న సైకో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వంలో అన్ని రకాల ఛార్జీలు, ఇంటి పన్ను భారీగా పెంచారన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు చేసే మేలు గురించి ఆయన ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనని ఎమ్మెల్యేగా గెలిపించాలని భూపేష్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, కొండ పాపయ్యపల్లె గ్రామ నాయకులు ఆవుల ఓబులేసు, గోపాల్‌రెడ్డి, రాము, సుబ్బన్న, రమణ, గురప్ప, మాధుసూదన్ రెడ్డి, మహీంద్ర రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గురవయ్య, కమల్‌బాషా, నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

పనులను వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు ఆదేశించారు. మంగళవారం పులివెందుల పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న పను లను ఎంత శాతం జరిగాయి అనే విషయాలపై చర్చించారు. ప్రతిరోజు పనులు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అధికారులు పలు పనులకు సంబంధించి వివరాలను కలెక్టర్‌కు వివరించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం పులివెందులలో జగనన్న హౌసింగ్ ఇల్లు నిర్మాణాల సంబంధించి రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డితో చర్చించారు. నిర్ణయించిన గడువులోపల పూర్తిచేసేలా అధికారుల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, పురపాలక ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, పురపాలక చైర్మన్ వరప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

కుష్టు వ్యాధి రహిత సమాజమే ధ్యేయం

ప్రజాశక్తి - ఖాజీపేట

కుష్టు వ్యాధి రహిత సమాజ స్థాపనే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి ఖాదర్‌వలి తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నాగసానిపల్లె సచివాలయం పరిధిలో నాగసానిపల్లె, జయరాంపేట, సుగాలి తండాలో కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని జిల్లా ఖాదర్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మం పాలిపోయిన లేక రాగి వర్ణంలో పొడలు, మచ్చలు, మచ్చలపై స్వర్శ లేకున్నా, మచ్చలపై చమట పట్టిన, వెంట్రుకలు పాక్షికంగా రాలిపోయిన, ముఖం నూనె రాసినట్లు నిగనిగ లాడిన, చర్మంపై మచ్చలుండి కాళ్ళు, చేతులలో స్వర్శ లోపించిన కుష్టు వ్యాధి లక్షణాలుగా పరిగణించాలని వివరించారు. డిపిఎంఒ వీరభద్రయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఏ ఒక్కరికి అనుమానం వచ్చిన వెంటనే ఆశా, ఎఎన్‌ఎంలను సంప్రదించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు పొడలు, మచ్చలు ఉన్నాయోమేనని పరీక్షించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, సిహెచ్‌ఓ సునీలా, ఏయన్ యం రాధ, ఆశా కార్యకర్తలు పద్మావతీ, సువార్తమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక వైవీఎస్ ప్రభుత్వ పాఠశాలలో 9వతరగతి విద్యార్థిని కొట్టి అవమానిస్తే ఇదేమని అడిగిన విద్యార్థిని తల్లిపై చేయి చేసుకున్న ఉపాధ్యాయురాలు సునందపై, విద్యార్థిని తల్లిని బెదిరించిన ఆమె భర్త కొండాపై పోలీసు కేసు నమోదు చేసి ఆ కుంటుంబానికి న్యాయం చేయాలని పిడిఎస్‌ఒ రాయలసీమ కన్వీనర్ ఓబులేసు డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం డిటి మనోహర్‌రెడ్డికి వినతిపత్రాన్నిచ్చారు. అక్కడ జరుగుతున్నదంతా గమనిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశీ విశ్వప్రసాద్ రెడ్డి సర్దుబాటు చేస్తున్నా వినకుండా అవమానించడం దారుణమన్నారు.

డిఇఒ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యార్థుల హక్కులను కాలరాసేలా సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు నిరసన తెలియజేసే హక్కు లేకుండా డిఇఒ రాఘవరెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్, విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను కాలారాసేలా విద్యార్థులు తమ హక్కుల కోసం పోరాటం చేసేందుకు వీల్లేకుండా డిఇఒ ఆదేశాలున్నాయని వారు ఆరోపించారు. డిఇఒ తాను జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బాషా, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ప్రజాస్వామ్య హాక్కులను కాలరాసేలా డిఇఒ రాఘవరెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని యువజన సంఘంగా డిమాండ్ చేస్తున్నామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో శివకుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో హక్కుల కోసం, ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన తెలిపే హక్కు ప్రతి పౌరునికి ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పిఆర్‌కు సన్మానం

పెద్దముడియం : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామ సుబ్బారెడ్డిని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ గ్రంథాలయ కమిటీ చైర్మన్‌గా నియమి తుల య్యారు. ఈ సంద ర్భంగా పిఆర్ గ్రామం గుండ్ల కుంటలో తన స్వగృహంలో శ్రీశైలం పాలక మండలి సభ్యులు గుద్దేటి నరసింహారెడ్డి శాలువా కప్పి ఆయనను ఘనంగా సన్మానించారు. గుండ్లకుంట మాజీ సర్పంచు నేస రమేష్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వద్ధిరాల లక్ష్మయ్య, ప్రముఖ బిల్డర్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పిఆర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 620/2022

సగిలి చంద్రశేఖర్‌రెడ్డి, వయస్సు 52 సంవత్సరాలు, తండ్రి వెంకటసుబ్బారెడ్డి, హిందు, వ్యాపారం, సాకిన్ డోర్‌నెం. 10/157, టీచర్స్ కాలనీ, మైదుకూరు రోడ్డు, ప్రొద్దుటూరు టవున్, కడప జిల్లా. **...వాది**

Vs

ముత్యాల సుభద్ర, వయస్సు సుమారు 60 సంవత్సరాలు, భర్త సుబ్బయ్య, హిందు, లారీ ఓనరు, సాకిన్ డోర్‌నెం. 4/1219–1, చౌడమ్మ దేవళం వీధి, ప్రొద్దుటూరు టవున్. **...1వ ప్రతివాది**

దావా సమను మరియు నోటీసు

పై నెంబరు దావాలోని వాది, ప్రతివాది అయిన నీపైన ప్రామిసరి నోటు నిమిత్తం మొత్తం రూ.4,51,466/– బాకీ రాకోరి పై కోర్టు నందు దావా దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావాతో పాటుగా నీతాలూకు చెందిన AP04-TW-8135 గల Ashok leyland Lorryని జప్తి కోరుచూ, I.A.No. 1140/2022 గల పిటిషన్‌ను దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావాలోను మరియు పిటిసన్‌లోను నీకు 7/8/2023నాడు వాయిదా వుంటూ ఉన్నది. అట్టి తేదీ నాడు ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారిఎదుట హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న ఎడల తెల్పుకోవలసినది లేనంతట నీ పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా తేది: 7/8/2023

//By Order of the Court//

పి.చంద్రశేఖర్
వాదిపరం అడ్వకేట్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా.
సెల్: 9866635497.